బండి నడిపేవాడు వాటిని కృతజ్ఞతగా అందుకుని, పాదాలని పాత బట్టతో తుడుచుకుని వాటిని ధరించాడు. దాంతో పాదాల నించి చలి ఒంట్లోకి పాకడం ఆగింది. బండి గమ్యం చేరాక రేబ్బి బండిలోంచి కిందకి దిగాడు. ఆయన పాదాలకి సాక్స్ లేకపోవడం గమనించిన బండివాడికి అర్థం అయింది ఆయన తనవి విప్పి తనకి వాటిని ఇచ్చాడని. బండివాడు నొచ్చుకుంటూ చెప్పాడు.

"అయ్యో! మీవి తీసి ఇచ్చారని తెలిస్తే తీసుకునేవాడిని కాను."

"నా కాళ్ళు పొడిగానే వున్నాయి. నేను పొడికాళ్ళకి సాక్స్‌ని ధరించి కూర్చుంటే, నువ్వు తడి కాళ్ళతో సాక్స్ లేకుండా బాధపడటం చూసి వాటిని నీకు ఇవ్వక పోతే నాది సరైన ప్రవర్తన అవుతుందా? నువ్వే చెప్పు." రేబ్బి నవ్వుతూ అడిగాడు.

## 81. సన్నిధి

ఓ ఆశ్రమంలో వుండి ఆధ్యాత్మిక విద్యాభ్యాసం చేస్తున్న ఓ శిష్యుడు ఓ రోజు తన గురువు దగ్గరకి వచ్చి చెప్పాడు.

"స్వామి! నేను మన ఆశ్రమం నించి వెళ్ళిపోదామని అనుకుంటున్నాను. ఇంటి దగ్గరే చదువుకుంటాను."

"అలా చేస్తే నువ్వు కష్టాలకి గురవుతావు. తోటి శిష్యుల సన్నిధిలో వుండి నువ్వు చదువుకుంటే బావుంటుంది." చెప్పాడు గురువు.

"కాని..."

"సరే. వివరణ వద్దు. నువ్వు నిశ్చయించుకుంటే వెళ్ళు."

సమీపంలో ఉన్న అరటి గెలలోంచి ఓ పండుని తెంపి ఇచ్చి చెప్పాడు.

"ఇది నీకేమైనా బోధిస్తుందేమో దారిలో చూడు."

శిష్యుడు అందరి దగ్గరా శెలవు తీసుకుని బయలుదేరాడు. ఆ రాత్రి ఓ అడవిలో ఓ కొలను సమీపంలో విశ్రమించాడు. ఆకలి వేయడంతో సంచీలోంచి గురు పత్ని ఇచ్చిన తినుబండారాలు తీసి తిన్నాడు. చివరగా గురువు ఇచ్చిన అరటిపండుని తీసాడు. గురువు దాని గురించి చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి.

అతను దాని తోలు వలిచి తింటూ ఆలోచించాడు కాని ఆ పండు బోధించేది ఏమిటో అతనికి అర్థం కాలేదు. తోలుని పారేసాక అతనికి స్ఫురించింది, గెలలో సుఖంగా వున్న అది గెలని విడిచి బయటకి రాగానే దానికి ఏమైందో.

మర్నాడు వుదయం నిద్ర లేచాక వెనక్కి తిరిగి మళ్ళీ ఆశ్రమానికి చేరుకున్నాడు. గురువు అతన్ని ఎందుకు తిరిగి వచ్చావని అడగలేదు.

## 82. పంజరం

ఓ రోజు ఓ మతాధికారి ప్రవచనం చెప్పడానికి భక్తుల ముందుకి వస్తూ తనతోపాటు ఓ పాత, తుప్పుపట్టిన పంజరాన్ని కూడా తీసుకువచ్చి దాన్ని అందరూ చూసేలా ఓ టేబిల్ మీద ఉంచాడు. దాన్ని చూసిన భక్తులంతా 'దాన్ని ఆయన ఎందుకు తెచ్చాడా?' అని ఒకరి వంక మరొకరు ప్రశ్నార్థకంగా చూసుకోసాగారు.

ఆయన తన ప్రవచనాన్ని మొదలు పెట్టాడు.

"నిన్న సాయంత్రం నేను గోదావరి నది ఒడ్డుకి వ్యాహ్యాళికి వెళ్ళినప్పుడు ఓ చిన్న పిల్లవాడు చేతిలో ఈ పంజరంతో కనిపించాడు. దాంట్లో అప్పుడే పట్టిన ఓ చిలుక ఆందోళనగా అరుస్తూ కనిపించింది. వాడిని అడిగాను, ఆ చిలకని ఎందుకు పట్టుకున్నావని.

"ఇంటికి తీసుకెళ్ళి దీంతో నేనూ, నా మిత్రులు కలిసి ఆడుకుంటాము." జవాబు చెప్పాడు వాడు.

"ఎలా ఆడుకుంటారు?" అడిగాను నేను.

"దీని ఈకలని పీకుతాము. ఆఖరి ఈకని ఎవరు పీకితే వారు గెలిచినట్లు." జవాబు చెప్పాడు.

"ఈకలన్నీ పోతే రెక్కలు లేక ఇక అది ఎగరలేదు కదా? అప్పుడెలా?" అడిగాను నేను.

"అప్పుడు దాన్ని మా పెంపుడు పిల్లికి ఆహారంగా వేసేస్తాను. పిల్లి నించి అది తప్పించుకోవాలని పరిగెత్తుతూంటే మా పిల్లి దాన్ని ఎలా పట్టుకుంటుందో చూస్తాం." ఆ పిల్లవాడు చెప్పాడు.